క్లుప్తంగా

రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కాంట్రాక్టర్

సాక్షి ఎఫెక్ట్..

సుల్తానాబాద్: పట్టణంలో నుంచి గట్టెపల్లి వెళ్లే రహదారి పనులను కాంట్రాక్టర్ ఆదివారం ప్రారంభించారు. రోడ్డుపై కంకర తేలడంతో పాటు దుమ్ముతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని శనివారం 'దుమ్ముతో వేగలేకపోతున్నాం' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పనులు ప్రారంభించేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ప్రారంభించారు. కాలనీవాసులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రంలో పని కల్పించాలి



ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎస్సీకాలనీవాసులు

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లిలో ఐకేపీ వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో పని కల్పించాలని ఎస్సీకాలనీవాసులు ఆదివారం ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో ఎస్సీకాలనీవాసులకు పని కల్పించారు. కానీ ఈ ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వంలో పని కల్పించడం లేదని ఆరోపించారు. గతంలో మాదిరిగా కొనుగోలు కేంద్రంలో పని ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో మంథని కుమారస్వామి, మైత్రి ఓదెలు, బూడిద శేఖర్, మంథని చిన్నకుమార్, అక్కపాక నాగేష్, మంథని రాజయ్య, బూడిద మధునయ్య, అక్కపాక సన్ని పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి

రామగిరి: వేసవికాలం దృష్ట్యా సింగరేణి కార్మికుల పనివేళలు మార్చాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆర్జీ–3 కన్వీనర్ బత్తుల శంకర్ ఒక ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రతను తట్టుకోలేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనివేళలో మార్పు జరిగితే కొంత ఉపశమనం కలుగుతుందన్నారు. ఎండలో విధులు నిర్వహించడంతో కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని, యాజమాన్యం స్పందించి కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

అంతర్గాంలో మేడే పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో ఆదివారం మేడే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కొల్లూరి మల్లేశ్ మాట్లాడుతూ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణలో పీవైఎల్ రాష్ట్ర నాయకుడు ఆరుముళ్ల తిరుపతి, బొంతు ఆనంద్, ఐఎఫ్‌టీయూ ప్రతినిధులు రవి, జి.రవి, సంజీవ్, మల్లేశ్, సారయ్య, కుమార్ ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



డిపాజిట్ పత్రం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: రామగుండం సమీపంలోని మల్యాలపల్లి సబ్‌స్టేషన్ వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వీడియో జర్నలిస్టు చొప్పరి ఓదెలు కుటుంబానికి బసంత్‌నగర్ ఇండియా మిషన్ పాఠశాల విద్యార్థులు చేయూత అందించారు. పాఠశాలలో 1999–2000 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు సేకరించిన విరాళాలు రూ.1.21లక్షలు మృతుడి కూతురు పేరుమీద పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి సంబంధిత పత్రాలను మృతుడి భార్య స్వరూపకు అందజేశారు. గుండా రమేశ్, ఎస్.వీ.సందీప్, రామోజీ తిరుమలాచారి, నజీర్ అహ్మద్, నీరజ, సంధ్య పాల్గొన్నారు.

ప్రమాద బీమా.. మత్స్యకారులకు ధీమా

- జిల్లాలో 200 సొసైటీలు
- సొసైటీలోని సభ్యులందరికీ వర్తింపు
- ఇప్పటివరకు 28 మందికి చెక్కులు అందజేత
- అవగాహన కల్పిస్తున్న అధికారులు



సుల్తానాబాద్‌లో చేపలు పడుతున్న మత్స్య కార్మికులు

సుల్తానాబాద్: కులవృత్తులపై ఆధారపడి ఎక్కువ మంది జీవనం సాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వాలు కులవృత్తులకు పెద్దపీట వేస్తున్నాయి. ఇందులో భాగంగా గత ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లల పంపిణీ చేయడంతో చెరువుల్లో చేపపిల్లలు పెరిగిన తర్వాత విక్రయించుకుని ఉపాధి పొందేవారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే వారి కుటుంబానికి ఆసరాగా ఉండాలని ప్రమాద బీమా సౌకర్యాన్ని సైతం కల్పించింది. దీంతో ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబానికి చేయూతనివ్వడానికి ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తుంది. జిల్లా వ్యాప్తంగా 2022 నుంచి 2024వరకు 40 మంది మృతి చెందగా 28 మందికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

సొసైటీలోని సభ్యులందరికీ వర్తింపు..

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులందరికీ బీమా పథకం వర్తిస్తుంది. బీమా యోజన కింద సభ్యులుగా చెల్లించాల్సిన ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. వాటిలో నూతనంగా సభ్యత్వం తీసుకున్న సభ్యులు కూడా ఈ పథకం వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను మత్స్యశాఖ అధికారులు పరిశీలిస్తారు. అర్హులను పథకంలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు. చేపలు పట్టడంలో ప్రమాదవశాత్తు నీట మునిగినా.. రోడ్డు ప్రమాదంలో మరణించినా మత్స్యకారుల కుటుంబాలకు ఈ పథకం కింద లబ్ధి చేకూరుతుంది. బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున సాయం అందజేస్తారు. బీమా పథకానికి కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. దరఖాస్తులు నిరంతరం కొనసాగుతున్నట్లు అధికారులు చెప్తున్నారు.

జిల్లాలో 200 సంఘాలు..

జిల్లావ్యాప్తంగా 200 సంఘాలలో 14,116 మంది సభ్యులు ఉన్నారు. వీరందరూ వృత్తిలో కొనసాగుతూ జీవనం సాగిస్తున్నారు. పీఎం మత్స్య బీమాయోజన పథకంలో వీరందరూ నమోదు చేసుకునేలా అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

సభ్యులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రమాద బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. పథకానికి అందరూ అర్హులే. పథకంతో కలిగే ప్రయోజనాలు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి మత్స్యబీమా యోజన పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ చేసుకున్నవారు కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలి. అర్హులను ఎంపిక చేస్తాం. ఇప్పటివరకు ప్రమాద బీమా ద్వారా 28 మందికి చెక్కులు అందజేశాం. మిగతా వారికి ప్రభుత్వం నుంచి చెక్కులు రావాల్సి ఉంది. – భాస్కర్ నాయక్, జిల్లా మత్స్యశాఖ అధికారి, పెద్దపల్లి

కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే పేదలకు న్యాయం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బడుగు, బలహీనవర్గాలకు, పేదలకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం రాత్రి ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటా ప్రచారం చేపట్టారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కొప్పెర తిరుమల్‌రెడ్డి, బాసంపల్లి కొండయ్య, పెద్ది కుమార్, మేడినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలి



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఓదెల: కాంగ్రెస్‌పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గుండ్లపల్లె గ్రామంలో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామాల్లో పార్టీ అమలు చేసిన సంక్షేమ పథకాలు మంచిపేరు తెచ్చాయన్నారు. మాజీ సర్పంచులు పుప్పాల శంకర్, పిట్టల రవికుమార్, ఎంపీటీసీ రాగిడి రవీందర్ రెడ్డి, నాయకులు సదాశివ్, భాస్కర్‌రెడ్డి, కందుల అశోక్, రాజయ్య పాల్గొన్నారు.

వంశీకృష్ణను గెలిపించాలి

మంథని: కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోటికార్ కిషన్ కోరారు. వంశీకృష్ణకు బీసీ వర్గాలు సంపూర్ణ మద్దతు ఇచ్చి గెలిపించాలన్నారు.

కొప్పుల ఈశ్వర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పెద్దపల్లి ఎంపీగా పోటీ చేస్తున్న కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. ఆదివారం రాత్రి నగరంలోని 42, 43వ డివిజన్లలో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠాన్ని చూపెట్టిందని, ఇప్పుడు హామీల విషయం ఎత్తడం లేదని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మెతుకు దేవరాజ్, నాయకులు మారుతి, పిల్లి రమేశ్, తాళ్ల శ్యాం పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఆ మూడు పార్టీలకు బుద్ధి చెప్పండి

మంథని: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులకు ఓటు ద్వారా ప్రజలు బుద్ధి చెప్పాలని పెద్దపల్లి పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థి బూడిద తిరుపతి కోరారు. పార్లమెంట్ పరిధిలో స్థానికేతరులు ఎన్నికల్లో నిలబడి ప్రజలకు కల్లిబొల్లి మాటలు చెప్పి, డబ్బు, మద్యం సీసాలతో ప్రజలను కొనుగోలు చేసి రాజ్యాధికారం చేపట్టే ఆలోచనలో ఉన్నారన్నారు. తనను గెలిపిస్తే అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకనై పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తానని తిరుపతి పేర్కొన్నారు.



సుల్తానాబాద్‌లో మినీ కలెక్టరేట్‌లో ఉన్న మరుగుదొడ్లు

నిరుపయోగంగా మరుగుదొడ్లు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌లోని మినీ కలెక్టరేట్‌లో ఉన్న మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కార్యాలయాలకు వచ్చే ప్రజలు కోరుతున్నారు. కార్యాలయంలో తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్, ఎస్‌టీవో, వ్యవసాయ కార్యాలయం, ఎక్సైజ్ కార్యాలయాలు ఉండగా పక్కనే ఎంపీడీవో, సివిల్ ఆస్పత్రి, కోర్టు ప్రాంగణాలకు పక్కనే అందుబాటులో ఉండేలా అప్పటి ప్రజాప్రతిధులు మరుగుదొడ్లు నిర్మించారు. అయితే అవి ఇప్పుడు వినియోగంలో లేవు. మహిళలకు తీవ్ర అసౌకర్యంగా ఉందని, వెంటనే మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకువచ్చి ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు.

ఓటుహక్కుపై అవగాహన



రత్నాపూర్‌లో కళాకారుల ప్రదర్శన

రామగిరి: తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల ఆధ్వర్యంలో ఆదివారం రత్నాపూర్ గ్రామంలో ఓటుహక్కు వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పలువురు కళాకారులు పాటలు పాడుతూ ఓటుహక్కు గురించి వివరించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కొత్తగా నమోదైన ఓటర్లు, అర్హులైన ఓటర్లు తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ రాజనర్సు, కోండ్ర వెంకన్నగౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, సలెంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, జిన్న రమ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలు తొలగించండి సారూ..



చెట్ల కొమ్మల మధ్యలో విద్యుత్ తీగలు

రామగుండం: అబాది రామగుండంలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఓ భారీ వృక్షానికి మధ్యలో నుంచి విద్యుత్ తీగలు ఉన్నాయి. దీంతో పలుమార్లు ఈదురుగాలులకు విద్యుత్ అంతరాయంతో ఇతర సమస్యలు ఎదురవుతున్నాయి. మూడురోజుల క్రితం ఒక్కసారిగా ఈదురుగాలులు వీయడంతో పలుమార్లు షార్ట్ సర్క్యూట్‌తో చెట్టుపై మంటలు చెలరేగి కొమ్మ పూర్తిగా కాలిపోయి విద్యుత్ తీగలపై వేలాడుతూ ఉంది. ఆ సమయంలో సదరు విద్యుత్ స్తంభానికి షార్ట్‌సర్క్యూట్ కావడంతో గృహ వినియోగదారుల ఇళ్లలో గృహోపకరణాలు ఫ్రిజ్‌లు, టీవీలు, గ్రైండర్లు కాలిపోయాయి. చాలా మంది ఆర్థికంగా నష్టపోయారు. ఈ విషయమై సంబంధిత ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయిన బాధితులను గుర్తించి ఆర్థికంగా సాయం అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రతీ వారం నిర్వహణ పేరుతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న అధికారులు ఇలాంటి దృశ్యాలను గుర్తించి విద్యుత్ సరఫరా సాఫీగా జరిగేందుకు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేటలో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలను ఎలా మోసం చేస్తుందో వివరించారు. కారు గుర్తుకు ఓటేసి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీపీ రాసకొండ లక్ష్మి, నాయకులు శ్రీనివాస్, వెంకటేశ్, లక్ష్మిమల్లు, కొమురయ్య, నారాయణ, రాజయ్య, కల్యాణ్, నర్సయ్య, శ్రీధర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

భూ నిర్వాసితులను మోసం చేస్తున్న సింగరేణి



మాట్లాడుతున్న ముల్మూరి శ్రీనివాస్

రామగిరి: లద్నాపూర్ భూనిర్వాసితులను సింగరేణి యాజమాన్యం మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం మండలంలోని లద్నాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీపీ–2 విస్తరణలో భాగంగా లద్నాపూర్, రచ్చపల్లి గ్రామాల భూ నిర్వాసితులకు మంథని మండలంలోని బిట్టుపల్లి గ్రామంలో ప్లాట్స్ కేటాయించారన్నారు. వారి అవసరాలకు ప్లాట్స్ అమ్ముకుందామన్నా రిజిస్ట్రేషన్ కావడం లేదని ఆరోపించారు. సంబంధిత కార్యాలయానికి వెళ్తే ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేయరాదని అధికారులు చెప్తున్నారని తెలిపారు. రత్నాపూర్, పన్నూర్ గ్రామాల్లో కేటాయించిన ప్లాట్స్ రిజిస్ట్రేషన్ అవుతున్నాయని, బిట్టుపల్లి ప్లాట్స్ ఎందుకు రిజిస్ట్రేషన్ కావడం లేదో అధికారులు తెలపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఓట్లు కోసమే తప్ప భూనిర్వాసితుల సమస్యలు ఏనాడూ పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. భూనిర్వాసితుల సమస్యలు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి భూనిర్వాసితులకు అండగా ఉంటూ వారి పక్షాన బీజేపీ పోరాడుతుందన్నారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో లద్నాపూర్ గ్రామస్తులతో కలిసి ఆర్జీ–3 జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు తీగల శ్రీధర్, దొంతుల సురేశ్, కన్నూరి మోహన్, మహేశ్, అనిల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలి



గోదావరిఖని: ప్రచారంలో మహిళా నాయకులు



సుల్తానాబాద్‌రూరల్: ప్రచారంలో నాయకులు

గోదావరిఖని: పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు బల్మూరి వనిత, మహిళా మోర్చా ఇన్‌చార్జి సోమారపు లావణ్య ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీనగర్, శివాజీనగర్, మెయిన్‌చౌరస్తాలో ఇంటింటా తిరుగుతూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో గోమాస శ్రీనివాస్ సతీమణి గోమాస గీత, నాయకులు మూకిరి రాజు, రమేశ్, గాండ్ల స్వరూప, ప్రసన్న, బండారు లక్ష్మి, కమల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

రామగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను గెలిపించాలని మండల అధ్యక్షుడు ముల్మూరి శ్రీనివాస్ ప్రజలను కోరారు. ఆదివారం మండలంలోని లద్నాపూర్ గ్రామంలో గోమాసకు మద్దతుగా ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధి కోసం బీజేపీకి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తీగల శ్రీధర్, దొంతుల సురేశ్, చిప్ప అనిల్, కన్నూరి మోహన్, మైదం మహేశ్, ఆర్.శ్రీనివాస్, పవన్ పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతు ఇవ్వాలి

సుల్తానాబాద్‌రూరల్: ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు మద్దతు ఇచ్చి ఓటు వేయాలని పార్టీ నాయకులు కోరారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గ్రామంలో ఆదివారం బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వడ్లకొండ మహేశ్, జెట్టి శ్రీనివాస్, సతీశ్, ప్రవీణ్, అనిల్‌గౌడ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలో తాగునీటి పైపులైన్



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ సంతోష్‌నగర్ ఏరియాలోని ఓపెన్ డ్రైనేజీ కాలువలో మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ వేశారు. ఆరునెలల కిందట మిషన్ భగీరథ పైపులైన్‌ను రోడ్డుపై నుంచి వేయాలని స్థానిక ప్రజలు కోరినప్పటికీ సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంతో దాదాపు వందమీటర్ల మేర పైపులైన్‌ను ఓపెన్ డ్రైనేజీ కాలువ లోపల నుంచి వేశారు. వర్షాకాలంలో డ్రైనేజీ నిండిపోతుంది. పైపులైన్ ఎక్కడైనా లీకేజీ అయితే డ్రైనేజీ నీరు తాగునీటిలో కలుస్తుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా వర్షాకాలం రాకముందే రామగుండం మున్సిపల్ సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ కాలువలోని మిషన్ భగీరథ పైపులైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మే 6న సెమిస్టర్ ఫీజు చెల్లింపు గడువు

గోదావరిఖనిటౌన్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ ప్రథమ సంవత్సరం బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించడానికి మే 6న చివరి తేదీ అని కోఆర్డినేటర్ జి.సుబ్బారావు, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాజేశ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.150 చెల్లించాలని, బీకాం కంప్యూటర్, బీఎస్సీ సైన్స్ విద్యార్థులు అదనంగా ల్యాబ్ ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ ఫీజు టీఎస్ ఆన్‌లైన్, మీ సేవా కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. మొదటి సెమిస్టర్ పరీక్షలు మే 26 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. సమయం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలన్నారు.

స్వర్ణకార సంఘం అధ్యక్షుడిగా నరహరి

కోల్‌సిటీ: రామగుండం మున్సిపల్ స్వర్ణకార సంఘం నూతన అధ్యక్షుడిగా కొండపర్తి నరహరి ఎన్నికయ్యారు. గోదావరిఖనిలో శుక్రవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి స్వర్ణకార సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో కొండపర్తి నరహరి గెలుపొందినట్లు ఎన్నికల అధికారి, జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షుడు రంగు శ్రీనివాస్ ప్రకటించారు.

ఖమ్మంపల్లి కార్యదర్శిగా ప్రేమలత

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి కార్యదర్శిగా ప్రేమలతకు పూర్తి బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీవో వేణుమాధవ్ తెలిపారు. ప్రేమలతను కేశనపల్లి నుంచి ఖమ్మంపల్లికి బదిలీచేశారు.

పోల్స్ సర్వేకు ఇంటర్నెట్ ప్రొవైడర్లు సహకరించాలి

పెద్దపల్లిరూరల్: ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లు వినియోగిస్తున్న విద్యుత్ పోల్స్ వివరాలను అందించాలని ట్రాన్స్‌కో ఎస్ఈ బొంకూరి సుదర్శన్ కోరారు. విద్యుత్ సంస్థ పోల్స్ వినియోగించుకుంటున్నందున పట్టణ ప్రాంతాల్లో పోల్‌కు రూ.20, పల్లె ప్రాంతాల్లో రూ.15లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోల్స్ వినియోగంపై తమ సంస్థ సిబ్బంది సర్వే చేస్తున్నారని, వారికి సహకరించి పోల్స్ సంఖ్య సక్రమంగా ఉండేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండలంలోని కొత్తూరు విద్యాభారతి ఉన్నత పాఠశాలలో 24 ఏళ్ల కలిసి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమై ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2000–01లో కలిసి చదువుకున్న మిత్రులు తమకు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల వ్యవస్థాపకులు గోనె లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు గన్ను సత్యనారాయణరెడ్డి, నూతి నరసింహాచారి, నూతి మల్లయ్య, గుండ రత్నాకర్ రెడ్డి, రొడ్డ ఉపేందర్, సంభోజీ రాజేశం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.